# మేనిఫెస్టో

సిహెచ్. శ్రీనివాస్

"హలో.... హలో... హలో... ఎవరండీ మాట్లాడేది, అది మెంటల్ హాస్పటలేనా!" అంటూ ఆత్రంగా అడుగుతున్నాడు ఆనందరావు.

"అవునండి, ఎవరు కావాలి మీకు" అట్నుంచి వినిపించింది.

"నేను అర్జంట్‌గా డాక్టరుగారితో మాట్లాడాలి, కొంచెం డాక్టర్‌గార్కి యివ్వండి" అన్నాడు ఆనందరావు.

"నేను డాక్టర్నే మాట్లాడుతున్నా" అంటూ ఖంగుమంది అవతలి కంఠం.

ఒక్కసారిగా కంగు తిన్నాడు ఆనందరావు. వెంటనే సర్దుకుని "సార్! మా అబ్బాయి పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తున్నాడు. మీ అంబులెన్స్‌ని మా ఇంటికి పంపించండి సార్" అంటూ చెప్పాడు.

"మీ అడ్రస్ ఇవ్వండి ఇప్పుడే పంపిస్తాను" అంటూ ఫోన్ పెట్టేశాడు అడ్రస్ తెలుసుకుని డాక్టర్.

అది విశాలమైన హాస్పిటల్. వారి వికృత చేష్టలతో చూసే వాళ్లకు సైతం పిచ్చెక్కేటట్లుంది అక్కడి వాతావరణం. అటువంటి హాస్పిటల్‌లోకి అడుగు పెట్టాడు అనందరావు ఆత్రుతగా!




నిన్న మొన్నటి వరకు తుళ్లుతూ ఉండే చేతికొచ్చిన కొడుకు గత 15రోజులుగా పిచ్చి పిచ్చిగా ప్రవర్తించటంను ఎవరికి చెప్పుకోలేక తన బాధను దిగమింగుకుంటూ, చివరకు ఈ రోజు కొడుకు ప్రవర్తన శృతి మించటంతో మెంటల్ హాస్పిటల్‌కు తీసుకురావలసిన పరిస్థితి ఏర్పడింది.

"ఏమిటి మీ అబ్బాయి ప్రాబ్లం" అన్న డాక్టరుగారి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు ఆనందరావు.

"మా అబ్బాయి పేరు అవినాష్, వయస్సు 24 సం॥లు, డిగ్రీ పూర్తి చేశాడు, ఉద్యోగాన్వేషణలో ఉన్నాడు. గత 15 రోజులు నుండి పిచ్చి పిచ్చిగా ప్రవర్తిస్తున్నాడండి, ముఖ్యంగా, న్యూస్‌పేపర్, టీ.వి. చూసినపుడు వాడి ప్రవర్తన వింతగా వుంటోంది" అంటూ వివరించాడు.

"ఇపుడేనా, ఇంతకు ముందు ఎపుడైనా మీ అబ్బాయి ఇలా ప్రవర్తించాడా?" అన్న డాక్టర్ ప్రశ్నకు సమాధానంగా..

"లేదు డాక్టర్, మా అబ్బాయికి ఇంత వరకు జర్వము కూడా తగలలేదు. అటువంటి మా అబ్బాయికి ఈ మాయదారి రోగం ఎలా దాపురించిందో డాక్టర్ మీరు మా వాడ్ని కాపాడండి" అంటూ బావురుమన్నాడు ఆనందరావు.

"మీరేం వర్రీ కాకండి" అంటూ... "నర్స్ ఆ పేషంటును స్పెషల్ రూంలోకి తీసుకెళ్లండి" అంటూ ఆదేశించాడు డాక్టర్.

"సార్ నాకు పిచ్చి లేదు... పిచ్చిలేదు.. నన్ను వదలండి" అంటూ తనను పట్టుకున్న వారి నుంచి విడిపించుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు అవినాష్.

"మరైతే పదిహేను రోజులనుండి పిచ్చి పిచ్చిగా మాట్లాడటం, న్యూస్ పేపర్ని చించటం, టీ.వి. పగలగొట్టబోవడం ఏమిటీ నీ ప్రవర్తన" అంటూ కసిరాడు డాక్టర్.

"నా ప్రవర్తనకు కారణం ఎలక్షన్స్!"

"ఎలక్షన్సా" ఒక్కసారిగా నిర్ఘాంతపోయి, "ఏమిటి విపులంగా చెప్పు" అన్నాడు డాక్టర్.

"అవునండీ ఎలక్షన్స్ డేట్ ప్రకటించినప్పటి నుండి పత్రికలలో, టీ.విలలో నాయకుల ప్రకటనలు వారి ప్రసంగ పాఠాలు వింటున్నా, వారి పార్టీలు, మేనిఫెస్టోలు చూస్తున్నా, నాకు లోపల ఏదో అలజడి జరిగి పిచ్చెక్కినట్లు అవుతోంది డాక్టర్" అంటూ విలపించాడు అవినాష్.

అతని సమాధానం విన్న డాక్టర్ ఒక్క క్షణం నిర్ఘాంతపోయి "నిజానికి ఈ మధ్య టీ.వి., పేపర్ ఏది చూసినా తనకూ అలానే అనిపిస్తోంది. దీనికి మందు ఎప్పుడు కని పెడ్తానో" అంటూ గొణుక్కుంటూ బయటకు వచ్చాడు డాక్టర్.

"డాక్టర్ మా బాబుకి" అంటూ ఆర్తోక్తిలో ఆగిపోయాడు ఆనందరావు.

"తగ్గుతుంది, అయితే పేపర్, టీ.వీ. వంటి వాటిని ఎలక్షన్స్ అయ్యేదాకా చూడనివ్వకండి" అంటూ సలహా యిచ్చాడు డాక్టర్.

❋